క్లుప్తంగా

విద్యార్థులను ప్రతీరోజు బడికి పంపాలి

బోథ్: తల్లిదండ్రులు ప్రతీరోజు విద్యార్థులను బడికి పంపాలని మండలంలోని పట్నాపూర్ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెస్రం రాము అన్నారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, మాజీ సర్పంచ్ తొడసం గోపాల్, ఆడెం పొల్లు, కైలాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ రోజు హోంవర్క్ చేయించాలి


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు

జైనథ్: విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతీ రోజు తమ పిల్లల హోంవర్క్ దగ్గరుండి చేయించాలని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయులు శశికళ అన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు వివిధ అంశాలపై తయారుచేసి, టీఎల్‌ఎంలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రఘు రమణ, అనిత, స్వాతి, మాళవిక, జయకర్, పోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ముఖరా(బి) మాజీ సర్పంచ్ అడవ్ మారుతి అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భోజనం, పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ప్రభుత్వం అందచేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

తలమడుగు: అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మొదటి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ అయిన కొంతమంది రైతులకు పూర్తిగా రాలేదన్నారు. అలాగే చాలామంది రైతులు లక్ష రుపాయల రుణం ఉన్నప్పటికీ జాబితాలో వారి పేరు లేదన్నారు. అనంతరం అధికారి పుల్లయ్య మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు రుణమాఫీ అందించడం జరుగుతుందన్నారు.

ఉద్యమ నాయకుడికి నివాళి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల హక్కుల కోసం తుడుందెబ్బ స్థాపించి అనేక పోరాటాలు చేసిన సిడాం శంభు 6వ వర్ధంతి శనివారం మండలంలోని మత్తడిగూడ గ్రామంలో శనివారం నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ నాయకురాలు సుగుణ, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు భుక్య జాన్సన్ నాయక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేరి రమేశ్ హాజరై ఆయన సమాది వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటాలు సాగించిన కుమురం భీం ఉద్యమ స్ఫూర్తితో శంభు ఆదివాసీ సమాజాన్ని ముందుండి నడిపించారని గుర్తుచేశారు. అంతకు ముందు కుటుంబసభ్యులు శంభు సమాది వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

సమాజంలో గురువు పాత్ర కీలకం

ఆదిలాబాద్‌టౌన్: సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుదే ముఖ్య పాత్ర అని వారిని గౌరవించాలని సరస్వతి శిశు మందిర్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ శిశు మందిర్ పాఠశాలలో గురు పూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, తేజస్విని, సుహాసినీ, సౌజన్య, వీణా, రాణీ, భవాని, కీర్తన, ప్రేమల పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని శ్రీసర్వసతి శిశుమందిర్, వేదం పాఠశాలలో శనివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శిశుమందిర్‌లో వ్యాస పౌర్ణమి విశిష్టత, గురువు గురించి ప్రధానోపాధ్యాయులు రాజేందర్ గౌడ్ విద్యార్థులకు వివరించారు. వేదం పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు రమేశ్‌బాబు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని ముసురు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్


ఇంద్రవెల్లి: వాగు దాటుతున్న మామిడిగూడ గ్రామస్తులు


ఇంద్రవెల్లి: ఏమాయికుంట శివారులోని పత్తి చేనులో వరదనీరు

బోథ్: మండల వ్యాప్తంగా శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. చిన్నపాటి జల్లులు రోజంతా కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో చిన్నపాటి వాగులు ప్రవహించాయి. కరత్వాడ ప్రాజెక్టులోకి కొంతనీరు చేరుకుంది. రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొనడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎస్సై రాము తెలిపారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం తెల్లవారుజమున నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మామిడిగూడ, జైత్రంతండా, గోపాల్‌పూర్, చిత్తబట్ట గ్రామాల వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. మామిడిగూడ గ్రామస్తులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటి గ్రామానికి చేరుకున్నారు. ఖైర్‌గూడ, పొల్లుగూడ, కొబ్బయ్‌గూడ గ్రామాల రోడ్లు చిత్తడిగా మారాయి.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. జిల్లా సరిహద్దుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదికి వరద ప్రవాహం పెరిగింది. పంటచేలలో సైతం వర్షపు నీరు నిలిచింది. ఉదయం నుంచి ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు.

నార్నూర్: భారీ వర్షం గిరిజన గ్రామాలకు అతలాకుతులం చేసింది. శనివారం ఉదయం నుంచే భారీ వర్షం కురవడంతో నార్నూర్, గాదిగూడ మండలాల్లో కల్వర్టులు, వాగులు పొంగి పొర్లడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బాబేఝరి పరిధిలోని చిత్తగూడ శివారులో రోడ్డు తెగిపోవడంతో బాబేఝరి, చిత్తగూడ, సింగపూర్, గొండుగూడ, కొలాంగూడ, తండా, చోర్గాం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గాదిగూడ మండలంలోని కునికాసా వాగు భారీగా ప్రవహించడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది.

సిరికొండ: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి పొద్దంత ముసురు పట్టుకుంది. శనివారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు.

బేల: మండలంలోని దహెగాం, మణియార్‌పూర్, అవాల్‌పూర్ రెవెన్యూ గ్రామాల శివారుల్లోని లోలెవల్ వంతెనలపై కురుస్తున్న ఏకదాటి వర్షాలకు శనివారం వరద నీరు ఉప్పొంగింది. ఈ గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.

నేరడిగొండ: భారీ వర్షాలు కురుస్తుండడంతో మండల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు, వంకల వద్ద వరద ప్రభావం అధికంగా ఉంటుందని, అక్కడికి వెళ్లవద్దని సూచించారు. రైతులు పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. కుంటాల జలపాతాన్ని సందర్శించే పర్యాటకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి జలపాతం దగ్గరికి వెళ్లకూడదన్నారు.


తాంసిలో కురుస్తున్న వర్షం


తాంసి: పంటచేలలో నిలిచిన వరద

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాలప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. త్వరలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ముఖడే ఉత్తం, మెస్రం నాగ్‌నాథ్, మసుద్, పవార్ దూదిరాంనాయక్, సోమోరే నాగోరావ్, జితేందర్, జహిర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో హెల్ప్‌వీల్ ఫౌండేషన్, న్యాక్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగి ఉండి, శిక్షణ పొందిన యువతులకు ఉచిత కుట్టు మిషన్‌లతో పాటు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, హెల్ప్‌వీల్ ఫౌండేషన్ సభ్యులు కాంబ్లే అతిష్, ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, మెస్రం నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

'ఫొటో ఎక్స్‌పో విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో కేబీఆర్ కన్వర్షన్‌లో ఈనెల 26, 27, 28న నిర్వహించే ఫొటో ఎక్స్ పోను విజయవంతం చేయాలని ఫొటో వీడియో గ్రాఫర్స్ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ అజయ్ కోరారు. శనివారం సంబంధించిన పోస్టర్లను సీఐ భీమేశ్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎరేకర్ దయాకర్, ఎర్రమ్ మహేశ్, వంశీకృష్ణ, చాకటి రమేశ్, రాహుల్, నరసయ్య, విక్రమ్, ప్రశాంత్, గంగాధర్ పాల్గొన్నారు.

జైనథ్: హైదరాబాద్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఫొటోగ్రాఫర్ల ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పురుషోత్తంతో పోస్టర్ విడుదల చేశారు. ఎక్స్‌పోకు ఫొటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు శ్రీకాంత్, సభ్యులు అఖిల్, విశాల్, అఖిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కాంగ్రెస్ పితామహుడు సీఆర్ఆర్


సీఆర్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కాంగ్రెస్ దశదిశ చూపిన మహానాయకుడు చిల్కూరి రాంచంద్రారెడ్డి అని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సీఆర్‌ఆర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్‌లో సీఆర్‌ఆర్ అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే సీఆర్‌ఆర్ అనేదీ ఎల్లప్పుడు ప్రజల్లో గుర్తుండిపోతుందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, లోక ప్రవీణ్ రెడ్డి, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, సామ రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

రెండువేల మొక్కలు నాటడమే లక్ష్యం


మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

నార్నూర్: సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో రెండు వేల మొక్కలను నాటడమే లక్ష్యమని సంస్థ ప్రోగ్రాం అధికారి రాథోడ్ దిలీప్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని చిత్తగూడ శివారులోని సెడ్వాయి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీలో పలు జాతుల మొక్కలు అంతరించిపోతున్న తరుణంలో వాటిని తిరిగి అందుబాటులో తీసుకొని రావాలని ఉద్దేశంతో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. వీటివలన పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు అంతరించిపోతున్న పండ్లు ఫలాలు అందుతాయన్నారు. గ్రామస్తులు హెచ్‌కె జగ్గేరావు, సీసీ శ్రీరాం, హెచ్‌కే సోము, ఎఫ్‌ఏ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని జామ్ని గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు, పోషకుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లల్ని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దేవుబాయి, ఉపాధ్యాయులు జ్యోతి, జయశ్రీ, లక్ష్మణ్, పెంటపర్తి ఊశన్న పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు డాక్టర్ బీయస్ రావు ఫౌండేషన్ గంద్ర మోహన్ రావు సౌజన్యంతో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు మాట్లాడుతూ తమ శాఖ పరిధిలోని స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు రూ. లక్ష విలువ చేసే జనరల్ నాలెడ్జ్ పుస్తకాల పంపిణీకి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ సల్ల విజయ్‌బాబు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని రుణమాఫీకి మళ్లించి రైతాంగాన్ని మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరిట రైతుభరోసాపై ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ పేరిట కేవలం 18,821 మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం రూ.120 కోట్ల 79 లక్షలను మాఫీ చేసిందన్నారు. అన్నదాతల సంక్షేమానికి పదేండ్ల కాలంలో పదకొండు లక్షల కోట్ల రూపాయాలు ఖర్చు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎరువుల కొరత, కరెంటు సరఫరాతో రైతులు ఇబ్బంది పడుతుంటే కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రైతులు సంఘటితమై మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, గంద్రత్ రమేశ్, మార్శెట్టి గోవర్ధన్, జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో జవహర్

నార్నూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున మారుమూల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. శనివారం ఎంపీడీవో జవహర్‌తో కలిసి మండలంలోని మల్లెంగి పరిధిలోని బారిక్ రావుగూడ, బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని దన్నుగూడ గ్రామాల వద్ద వాగు వరద ఉధృతిని పరిశీలించారు. చిత్తగూడ గ్రామం వద్ద రోడ్డు తెగిపోవడంతో అక్కడ వెళ్లి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. దాదాపు ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. భారీ వర్షాల్లోనూ వాగు దాటే సాహసం చేయవద్దని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పంచాయతీ కార్యదర్శితో పాటు ప్రత్యేకాధికారులకు సమాచారం అందించాలన్నారు. వారి వెంట వీఆర్‌ఏ రమేశ్, తదితరులు ఉన్నారు.

తాంసి: రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాంసి ఎస్సై శివరాం కోరారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి మాట్లాడారు. వర్షాల వలన వాగులు, వంకలు వరదనీటితో ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ చేయాలన్నారు.

గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సబ్‌స్టేషన్‌లో శుక్రవారం 33 కేవీ విద్యుత్‌లైన్ ఎల్బీ లింబ్ పేలిపోవడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 10 గంటల సమయంలో ఎల్బీ లింబ్ బ్రేక్ కావడంతో నాలుగు గంటల పాటు అర్లి(టి), కరంజి, అంతర్గాంతో పాటు గుబిడి, రాంపూర్, కరన్‌వాడీ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ శ్రావణ్ కుమార్ అర్ధరాత్రి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి మరో లింబ్‌ను అమర్చారు. ఏఈలు సత్యనారాయణ, సిబ్బంది వసంత్, అనిల్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సిరికొండ: మండల కేంద్రంలో శనివారం సీపీఐ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ తెలిపారు. మండల కన్వీనర్‌గా మహబూబ్ ఖాన్, కో కన్వీనర్‌గా బోడ్డు నవవిత, సభ్యులుగా స్వర్ణలను ఎన్నుకున్నట్లుగా పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కరం కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో భోథ్ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్, కుంటల రాము, గోదావరి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకుని తిరుగులేనిశక్తిగా మారిందని అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పద్మశాలీ సంఘం తాలుకా అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్ నేతృత్వంలో ఉపాధ్యక్షుడు అనుముల ఊశన్న, ముదిగొండ సుధాకర్, గంగన్న, జోగు వెంకట్, తుమ్మ రాజు, కుర్ర నరేశ్, అనుముల ఉదయ్, మెంచు ఆశన్న, కటకం మహేశ్‌తో పాటు పలువురు లాండస్వాంగి గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావు మేనత్త భగీర్తాబాయి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు నాయకురాలు ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం బంగారుగూడకు వెళ్లి వారి కుమారులు సీతయ్య, గంగారాం, పరుశురాం పటేల్‌లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రైతు బండి నర్సింలు, కాంగ్రెస్ కార్యకర్త చంద్రకాంత్ రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తాంసి: భీంపూర్ మండలంలోని కమట్‌వాడ గ్రామ మాజీసర్పంచ్ తాటిపెల్లి రత్నబాయి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

బజార్‌హత్నూర్: చట్టాలను గౌరవించాలని బోథ్ సివిల్ జూనియర్ కోర్టు న్యాయవాది ఎట్టం రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు నూతన చట్టాలపై, బాల్య వివాహాలు నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, లోక్ అదాలత్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేశ్, భూమన్న, భగత్ బాపురావ్, గంగయ్య, రాజేశ్వర్, దామోదర్, మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని లెప్రసీ కాలనీలో ఉంటూ యాచకురాలిగా జీవనం సాగిస్తున్న వృద్ధురాలు కస్కే లక్ష్మీబాయి శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు కూమారుడు ఉన్నాడు. అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మానవ సేవే మాధవ సేవ సమితికి విషయం తెలియడంతో వారు ముందుకు వచ్చి అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు శ్రీపాద్‌వార్ శ్రీనివాస్, పద్మావార్ శ్రీనివాస్, చిందం దేవిదాస్, కనక నర్సింగ్, మహేష్, సంజీవ్, నాందేవ్, రాములు , దేవిసింగ్, నర్సింలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అనస్తీషియా దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం అనస్తీషియా దినోత్సవాన్ని జరుపుకున్నారు. వైద్యులు కేక్ కట్ చేసి తోటి వైద్యులకు శుభాకాంక్షలను తెలియజేశారు. న్యూరాలజిస్టు కార్తీక్ కుమార్, వైద్యులు బండారి నరేందర్, అనస్తీషియా టెక్నీషియన్ జిల్లా అధ్యక్షుడు సునీల్, రమ్య, మనీషా, సాధన, అనిష్, షఫీ పాల్గొన్నారు.

'ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు'

ఎదులాపురం: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు ఎంఏ షకీల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, బల్దియా మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజానిపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు.

ప్రతీ శనివారం వారసంత

నేరడిగొండ: మండల కేంద్రంలో ప్రతీ శనివారం వారసంత ఉంటుందని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రతీ శనివారం వారసంత కొనసాగుతుందన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ బాట

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం నిర్వహించిన అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం శనివారం ముగిసింది. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య నగర్ ఉత్తమ తల్లిదండ్రులను ఎంపిక చేసి శాలువాతో సత్కరించారు. బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, ఏఎన్‌ఎం మమత, ఆశ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వెల్‌నెస్ క్యాంప్

బోథ్: మండల కేంద్రంలోని వాసవి పాఠశాలలో ఆదివారం ఉచిత వెల్‌నెస్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త అనిల్ తెలిపారు. బరువు పెరుగుదత, తగ్గుదల, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, వివిధ రకాల పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు సంప్రదించాలని కోరారు.